## క్లుప్తంగా

### ప్రతిష్టాత్మకంగా 'జగనన్నే మన భవిష్యత్తు'



సమావేశమైన 15వ వార్డు కన్వీనర్లు

మద్దిలపాలెం : జగనన్నే మన భవిష్యత్ కార్యక్రమం వచ్చేనెల 1వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా 15వ వార్డులో గురువారం వార్డు కన్వీనర్లతో ఆ పార్టీ వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు సమావేశమయ్యారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి అందరూ చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు, వార్డు అధ్యక్షుడు పీలా వెంకట్, బుగత ఏసురత్నం, వెంకటలక్ష్మి, గొలగాని త్రినాథ్, నారాయణరావు, పడమట సురేష్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### మొబైల్ ఫాస్ట్‌ఫుడ్ వాహనాల తొలగింపు



ఫాస్ట్‌ఫుడ్ వాహనాన్ని తొలగిస్తున్న దృశ్యం

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ జోన్-3 అధికారుల పర్యవేక్షణలో మొబైల్ ఫాస్ట్‌ఫుడ్ వాహనాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. కొద్ది రోజులుగా ట్రాఫిక్‌కు పాటు నగర అభివృద్ధి ప్రాజెక్టులకు ఇబ్బందిగా మారడంతో కొన్ని చోట్ల రోడ్లపై బడ్డీలు తొలగిస్తున్నారు. ఇందులో భాగంగా ఎంవీపీ కాలనీలోని స్పోర్ట్స్ ఎరీనా ఎదుట ఉన్న మొబైల్ ఫాస్ట్‌ఫుడ్ వాహనాలను అధికారులు తొలగించారు. జీవీఎంసీ జోన్-3 కమిషనర్ విజయలక్ష్మి పర్యవేక్షణలో టౌన్‌ప్లానింగ్ అధికారులు వీటి తొలగింపు ప్రక్రియ చేపట్టారు. అలాగే కొందరి వ్యాపారుల గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ రోడ్డులో వ్యాపార లావాదేవీలు సాగించవద్దని పలుమార్లు హెచ్చరించినా వారు వినిపించుకోకపోవడంతో సిలిండర్లు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

### రైతుబజార్ స్టాళ్లకు డ్రా



రైతుకు స్టాల్ టోకెన్ ఇస్తున్న మార్కెటింగ్ అధికారి యాసిన్

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని డ్వాక్రా, దివ్యాంగుల స్టాళ్లను గురువారం జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి యాసిన్ పరిశీలించారు. వారు విక్రయిస్తున్న సరకుల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన రైతుల స్టాళ్లకు డ్రా తీశారు. ఉదయం బజారు 86, సాయంత్రం బజారు 45 స్టాళ్లకు డ్రా తీసి వ్యాపారులకు కేటాయించారు. ఈ సందర్భంగా యాసిన్ మట్లాడుతూ రైతులు వారికి వచ్చిన స్టాల్‌లో వ్యాపారం నిర్వహిరచాలని సూచించారు. ప్రతి రైతు వద్ద ఐడీ కార్డు ఉండాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో రైతుబజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్ పాల్గొన్నారు.

### షిప్‌యార్డ్‌లో ఎన్నికల సందడి

సింధియా : హిందూస్తాన్ షిప్‌యార్డ్‌లో గుర్తింపు యూనియన్ ఎన్నికల సందడి ప్రారంభమైంది.ఈ మేరకు శుక్రవారం ఓటరు జాబితాను ఎన్నికల రిటైనింగ్ అధికారి ప్రకటించనుండగా, శనివారం ఓటరు జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. నవంబర్ 7న తుది జాబితా ప్రకటించనున్నారు. 8వ తేదీన నామినేషన్లు స్వీకరిస్తారు. 9న నామినేషన్లు ఉపసంహరణతో పాటు ఎన్నికల గుర్తులను ప్రకటించనున్నారు. 18వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గుర్తింపు యూనియన్ ఎన్నికలను నిర్వహించి, సాయంత్రం 5 గంటలకు విజేతలను ప్రకటిస్తారు.



# 'చెత్త' కథ.. మళ్లీ మొదటికి.!



ముడసర్లోవ రిజర్వాయరు వెనుక రోడ్డుపై చెత్త కుప్పలు



తొలగించిన ఇనుప గేటు

- ముడసర్లోవ వద్ద యథేచ్ఛగా వ్యర్థాల డంపింగ్
- అడ్డుగా పెట్టిన ఇనుప గేటు తొలగించిన వైనం

ఆరిలోవ: ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక చెత్త డంపింగ్ వ్యవహారం మళ్లీ మొదటికొచ్చింది. ఏడాది క్రితం ఇక్కడ ఉన్న విశాలమైన రోడ్లు డెబ్రిస్‌తో నిండిపోయాయి. నగరంలో పలు ప్రాంతాల నుంచి లారీలతో డెబ్రిస్ తీసుకొచ్చి ఈ రోడ్లలో డంప్ చేస్తుండేవారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన జీ-20 సదస్సుకు హాజరైన దేశ, విదేశీ ప్రతినిధులు ముడసర్లోవలో ఫ్లోటింగ్ సోలార్‌ను సందర్శించారు. ఆ సమయంలో ఇక్కడ డెబ్రిస్‌తో నిండిపోయిన రోడ్లను శుభ్రం చేశారు. డెబ్రిస్ తొలగించి, లారీలు రిజర్వాయర్ వెనుక రోడ్లలోకి ప్రవేశించకుండా ఐదు చోట్ల ఇనుప గేట్లు అడ్డుగా ఏర్పాటు చేశారు. దీంతో డెబ్రిస్ డంపింగ్‌కు బ్రేక్ పడింది. అంత వరకు బాగానే ఉంది. ఇటీవల కొన్నిచోట్ల ఇనుప గేట్లు ఒకవైపు తొలగించేశారు. ముడసర్లోవ డంపింగ్ యార్డు పక్కన రోడ్లలో మళ్లీ డెబ్రిస్ వేసేస్తున్నారు. కొద్ది రోజులుగా వేసిన డెబ్రిస్‌తో ఈ రోడ్లు మూసుకుపోతున్నాయి. డెబ్రిస్ దిబ్బలు వల్ల రహదారులు మూసుకుపోవడంతో పాటు దుర్వాసన వస్తోంది. అధికారులు రూ.లక్షలు ఖర్చుపెట్టి పని చేస్తున్నప్పటికీ పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి వస్తుందని స్థానికులు అంటున్నారు. గతంలో ఇలా రెండుసార్లు ఇక్కడ డెబ్రిస్ తొలగించడానికి జీవీఎంసీ అధికారులు సుమారు రూ.కోటికి పైగా ఖర్చు చేసినట్లు గుర్తు చేస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి చెత్త డంపింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## విద్యా సమాచారమ్

### 29న ఉత్తరాంధ్ర జిల్లాల యోగా పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: జిల్లా యోగా అసోసియేషన్, ఏయూ యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 29న ఉత్తరాంధ్ర జిల్లాల యోగా పోటీలు-2023 జరగనున్నాయి. ఈ మేరకు వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి గురువారం ఏయూ సైన్స్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏయూ యోగా కేంద్రం సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్, యోగా అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఎ.రాజు, కార్యదర్శి సిహెచ్.వెంకటరమేష్, కోశాధికారి జి.రమణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

### మణికుమార్‌కు ఏయూ డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగం పరిశోధక విద్యార్థి జె.మణికుమార్‌కు ఏయూ డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు వై.శ్రీనివాసరావు పర్యవేక్షణలో 'ఇంప్లిమెంట్ ఆఫ్ నేచర్ ఇన్‌స్పైర్డ్ ఆప్టిమైజేషన్ అల్గారిథమ్స్ టు ఎంఆర్ఐ ఇమేజ్ ఎన్‌హాన్స్‌మెంట్'అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. దేశ రక్షణ, వైద్య రంగానికి ఈ పరిశోధన ఉపయుక్తంగా నిలుస్తుంది. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను మణికుమార్ గురువారం స్వీకరించారు.

## మూతపడిన గృహ నిర్మిత కేంద్రం



పైనాపిల్ కాలనీ వద్ద తెరుచుకోని గృహ నిర్మిత కేంద్రం



కేంద్రం బోర్డు

ఆరిలోవ: పైనాపిల్ కాలనీలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థ గృహ నిర్మాణ నిర్మిత కేంద్రం మూతపడింది. ఒకప్పుడు నిత్యం సందడిగా ఉండే ఈ కేంద్రం ఇప్పుడు పిచ్చి మొక్కలు, ముళ్ల పొదళ్ల మధ్య దర్శనమిస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఇక్కడ సుమారు 25 ఏళ్ల క్రితం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ నాణ్యమైన సిమెంట్ ఇటుకలు ఉత్పత్తి చేసేవారు. ఈ కేంద్రంలో ఉత్పత్తి అయిన ఇటుకలను ప్రభుత్వ రంగ సంస్థలు చేపట్టే నిర్మాణాల కోసం వినియోగించేవారు. నగరంతో పాటు జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర భవనాలు ఎక్కడ నిర్మాణం జరిగినా ఇక్కడి ఇటుకలనే సరఫరా చేసేవారు. ఇటుకలు నాణ్యమైనవి కావడంతో ప్రైవేట్ వ్యక్తులు గృహ నిర్మాణం కోసం కూడా కొనుగోలు చేసేవారు. వాటి కోసం ముందుగా వచ్చి ఇండెంట్ పెట్టుకునేవారు. వచ్చే ఇండెంట్ల ప్రకారం ఇటుకలను తయారు చేసేవారు. ఇలా ఇటుకలను తీసుకెళ్లడానికి వచ్చే వాహనాలతో ఇక్కడ రోజూ సందడిగా ఉండేది. ప్రస్తుతం ఇది మూతపడింది. సుమారు మూడేళ్లుగా ఇక్కడ సిమెంట్ ఇటుకలు ఉత్పత్తి నిలిచిపోయింది. సుమారు రెండెకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్రాంగణంలో పిచ్చి మొక్కలు, తుప్పలు దట్టంగా పెరిగిపోయాయి. ఈ కేంద్రం బోర్డు సైతం చెట్ల కొమ్మల చాటున కనిపించడంలేదు. అధికారులు స్పందించి ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొస్తే చాలా మందికి ఉపాధి లభిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## పరిశ్రమలను కాపాడుకుంటేనే కార్మికులకు భవిష్యత్తు



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ పరిశ్రమలను కాపాడుకుంటేనే కార్మికులకు భవిష్యత్తు ఉంటుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 987వ రోజుకు చేరుకున్నాయి. శిబిరంలో స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్-1 విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నేడు కేంద్రప్రభుత్వ పెద్దలు దేశంలోని ప్రజా సమస్యలను వదిలిపెట్టి తమ రాజకీయ అవసరాల కోసమే పాలన సాగిస్తున్నారని విమర్శించారు. అధికార పార్టీల కుట్ర రాజకీయాలను వ్యతిరేకించాల్సిన ప్రతిపక్ష పార్టీలు వారికి వంతపాడుతున్నాయన్నారు. ప్రజాపోరాటాల ద్వారా జరిగే ఉద్యమాలకు పాలకులు కచ్చితంగా జవాబు ఇచ్చి తీరాలన్నారు. ఉక్కు పోరాటాన్ని ప్రజా ఉద్యమంగా మలచి పాలకులు స్పందించే విధంగా కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. శిబిరంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

## ప్రాణాంతక వ్యాధితో చిన్నారి పోరాటం

దాతలు సహకరించాలని తల్లిదండ్రుల విజ్ఞప్తి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుష్మిక

మద్రిపాలెం: ప్రాణాంతక వ్యాధికి గురై తమ ఆరేళ్ల కుమార్తె కుష్మిక మృత్యువుతో పోరాడుతోందని మురళీనగర్ తెన్నేటినగర్‌కు చెందిన పేద దంపతులు గణేష్, షారా ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారి వైద్యానికి సాయం చేసేందుకు దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు గురువారం తెన్నేటినగర్‌లోని జీసస్ వర్డ్ ఆఫ్ లైఫ్ పాస్టర్ అండ్ లీడర్స్ ఫెలోషిప్ కార్యాలయంలో మీడియాతో వారు మాట్లాడారు. తమ కుమార్తె ప్రస్తుతం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోందని చెప్పారు. వైద్యానికి సుమారు రూ.15 లక్షలు అవసరమవుతుందని డాక్టర్లు తెలియజేశారన్నారు. బంధువుల సహాయంతో ప్రాణాలు కాపాడుకొస్తున్న తమకు దాతలు సహాయం అందించి తమ బిడ్డ ప్రాణాలను కాపాడాలని వేడుకున్నారు. మీడియా ద్వారా దాతల సహాయం కోసం అభ్యర్థించారు. సహాయం చేసే వారు 79818 87454 నంబర్‌లో సంప్రదించాలని కుష్మిక తల్లిదండ్రులు కోరారు.

### శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ), రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎన్ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ఖాళీలు ఉన్నాయని, రెండు నెలల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. వయసు 18 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలని, పదో తరగతి పాసైన వారు అర్హులని తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు పెదగంట్యాడలోని ఎన్ఏసీ శిక్షణ సంస్థలో, 83090 03957లో సంప్రదించాలని కోరారు.

### ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



విద్యుత్ వైర్లు బయటకు కనిపిస్తున్న దృశ్యం

ఎంవీపీ కాలనీ: నిత్యం సందర్శకులతో కిటకిటలాడే శివాజీ పార్కులో విద్యుత్ వైర్లు బయటకు కనిపిస్తూ ఆందోళన కలిగిస్తున్నాయి. పార్కులో విద్యుత్ స్తంభాల ఏర్పాట్లలో భాగంగా వైర్లను అనుసంధానించారు. అయితే ఆయా స్తంభాలు శిథిలావస్థకు చేరడంతో వైర్లు బయటకు కనిపిస్తున్నాయి. దీంతో పార్కుకు వచ్చే సందర్శకులు వాటిని చూసి ఆందోళనకు గురవుతున్నారు. పిల్లలు సంచరించే చోట వీటిని పట్టించుకోకుండా వదిలేయడంపై ఆగ్రహం చెందుతున్నారు. ఇప్పటికైనా నిర్వాహకులు స్పందించి పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా విద్యుత్ దీపాలను సైతం ఆధునికీకరించాలని కోరుతున్నారు.

### గుర్తు తెలియని వృద్ధుడి మృతి



రైల్వే స్టేషన్‌లో వృద్ధుడి మృతదేహం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్ 8 ట్రాక్‌పై గుర్తు తెలియని ఓ వృద్ధుడు మరణించాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. సుమారు 60 ఏళ్ల వయసు గల వృద్ధుడు రైల్వే ట్రాక్‌పై మృతి చెందాడు. ఇతడు సుమారు 5.6 అడుగుల ఎత్తు, చామన చాయ శరీర రంగు. లేత పసుపు, తెలుపు రంగు ఫుల్ హ్యాండ్ చొక్కా, నీలం, తెలుపు రంగు లుంగీ ధరించి ఉన్నాడు. ఇతడి వద్ద ఏ విధమైన ఆధారాలు లేవు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు విశాఖ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ సిబ్బందికి స్వయంగా గానీ 94934 74582, 94406 27547 నంబర్లలో గానీ తెలియజేయాలని ఎస్ఐ మధుసూదనరావు కోరారు.

### ఆకట్టుకున్న భక్తిరంజని



భక్తిరంజని భజనలు చేస్తున్న సాయిరాజ్

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారి ఆలయంలో గురువారం ధర్మప్రచార వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయిరాజు భక్తి రంజని ప్రతినిధుల భజనలు ఆకట్టుకున్నాయి. ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో జి.వి.రమాబాయి, భక్తులు పాల్గొన్నారు.

### 11 నుంచి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

భీమునిపట్నం: భీమిలి వైఎంసీఏ ఆధ్వర్యంలో నవంబర్ 11, 12న షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్టు అధ్యక్షుడు కె.ఎస్.ఎం.సుధాకర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ త్వరలో వైఎంసీఏ మెంబర్‌షిప్ డ్రైవ్ నిర్వహించనున్నామని తెలిపారు. కార్యదర్శి ఆల్బర్ట్ సుదర్శన్, కోశాధికారి కె.ప్రేమానందరావు, సభ్యులు జి.ఏసుదాస్, విలియమ్ కేరీ, ప్రభాకర్, రేవంత్‌కుమార్ పాల్గొన్నారు.

### సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసిపూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పంచామృతాభిషేక సేవ, శ్రీచక్ర నవావర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు, ఏఈవో తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

**నేడు క్షీరాభిషేక సేవ..**

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతిస్తారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

## ఆరోగ్య సురక్ష శిబిరాలకు విశేష స్పందన



బాలాజీనగర్ యూపీహెచ్‌సీలో రోగులు



ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటున్న వైద్యుడు

ఆరిలోవ: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. 11వ వార్డు బాలాజీనగర్ యూపీహెచ్‌సీలో కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం గురువారం ముగిసింది. ఆరిలోవ ప్రాంతంలో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల(యూపీహెచ్‌సీలు)లో కొద్ది రోజులుగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు జరుగుతున్న విషయం తెలిసిందే. 13వ వార్డు ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్ వద్ద ఉన్న యూపీహెచ్‌సీలో జరుగుతున్న వైద్య శిబిరం బుధవారం ముగియగా.. బాలాజీనగర్ యూపీహెచ్‌సీలో గురువారం ముగిసింది. ఇక్కడ ఈ నెల 7న మెగా వైద్య శిబిరాన్ని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ప్రారంభించారు. అనంతరం ఈనెల 16 నుంచి 22 వరకు, దసరా సెలువుల అనంతరం 25, 26 తేదీల్లో మొత్తం 10 రోజుల పాటు శిబిరాలు జరిగాయి. ఈ యూపీహెచ్‌సీలో జీవీఎంసీ 11, 12 వార్డులకు సంబంధించిన 12 సచివాలయాల పరిధిలో ఉన్న ప్రజలకు వైద్య సిబ్బంది సేవలు అందించారు. ఈ శిబిరంలో రోజూ ఆరుగురు వైద్యులు, 12 మంది ఏఎన్ఎంలు, 17 మంది ఆశా వర్కర్లు, 8 మంది సహాయక ఇబ్బంది సేవలు అందించారు. పది రోజుల పాటు జరిగిన ఇక్కడ శిబిరంలో 2,179 మందికి వైద్య సేవలు అందించినట్లు బాలాజీనగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్ లలితాదేవి తెలిపారు. వీరిలో అవసరమైన 129 మందికి ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్యం అందించడానికి రిఫర్ చేసినట్లు తెలిపారు. దీంతో పాటు బుధవారం ముగిసిన ఆరిలోవకాలనీ యూపీహెచ్‌సీలో 9 రోజులు పాటు వైద్య శిబిరం జరిగింది. ఇక్కడ జీవీఎంసీ, 12, 13 వార్డులకు సంబంధించిన 10 సచివాలయాల పరిధిలో వైద్య సేవలు అందించారు. ఇక్కడ 1,803 మందిని పరీక్షించి మందులు అందజేసినట్లు యూపీహెచ్‌సీ వైద్యాధికారి సుమన్ తెలిపారు. వారిలో 127 మందిని ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించడానికి రిఫర్ చేశామన్నారు. 10వ వార్డు వివేకానందనగర్ యూపీహెచ్‌సీలో వైద్య శిబిరం కొనసాగుతుంది. 13వ వార్డు శ్రీకృష్ణాపురం యూపీహెచ్‌సీలో ఒకటి, రెండు రోజుల్లో ఆరోగ్య సురక్ష శిబిరం ప్రారంభంకానుంది.

## అందరికీ మెరుగైన వైద్యమే లక్ష్యం



లబ్ధిదారులకు వైద్య సేవల కార్డులు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పుక్కళ్ల శంకర్

ఎంవీపీ కాలనీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందుతోందని వైఎస్సార్‌సీపీ నాయకుడు పుక్కళ్ల శంకర్ అన్నారు. జోన్-3 పరిధిలోని 18వ వార్డు 105 సచివాలయం పరిధిలో గురువారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. స్పెషలిస్ట్ డాక్టర్ల పర్యవేక్షణలో సిబ్బంది ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన మందులు అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. జోన్-3 కమిషనర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రజారోగ్యం కోసం ప్రభుత్వ వ్యవస్థలన్నీ కృషి చేస్తున్నాయన్నారు. ఈ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డోర్ డెలివరీ మాసోత్సవాలు ప్రారంభం



మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న మద్దిలపాలెం డిపో మేనేజర్ అరుణకుమారి

మద్దిలపాలెం : ఆర్టీసీ డోర్ డెలివరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మద్దిలపాలెం డిపో మేనేజర్ అరుణకుమారి అన్నారు. డోరు డెలివరీ మాసోత్సవాలను గురువారం ఆమె డిపో ఆవరణలో కౌంటర్ వద్ద పోస్టర్ ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సేవలను నగరంలో 10 కిలోమీటర్ల మేరకు అందిస్తామన్నారు. గాజువాక, అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, శ్రీకాకుళం, విజయనగరం తదితర ప్రాంతాలలో పార్సిళ్లు బుక్ చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీఎం జి.అప్పారావు, పాల్గొన్నారు.

## 8న విద్యా సంస్థల బంద్



వివరాలు వెల్లడిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

అల్లిపురం : విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అన్ని విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 8వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు విద్యా సంస్థలు బంద్ ప్రకటించినట్లు ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి ఉల్లం నాగరాజు, కార్యదర్శి వై. రాంబాబు తెలిపారు. సీపీఐ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉక్కు కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు నవంబర్ 8వ తేదీకి వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యా సంస్థలు బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ బందులో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు అచ్యుతరావు, పీడీఎస్ఎఫ్ జిల్లా నాయకురాలు అభిశ్రీ, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రతన్‌కాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు శేఖర్, జీవన్, మనీ, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## 'ఓపెన్ హౌస్'పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార: పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. దీనికి అక్కయ్యపాలెం జ్ఞాననికేతన్ స్కూల్ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ ఎస్.విజయకుమార్ మాట్లాడుతూ స్టూడెంట్లకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మ్యాన్‌ప్యాక్‌లు ఉపయోగించే తీరు, అత్యవసర సమయంలో పోలీసులు స్పందించే తీరు, కేసుల నమోదు, రిసెప్షన్ తీసుకున్న నిర్ణయాలు, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మాట్లాడే విధానం, ఆయుధాలు ఎప్పుడు ఉపయోగించాలనే విషయాలను తెలియజేశారు. స్టేషన్‌లో విధులు నిర్వర్తించే సీఐ, ఎస్ఐ, ఏఎస్ఐ, హెచ్‌సీ, పీసీల విధివిధానాలపై వివరించారు. ప్రతి ఒక్క విషయాన్ని విద్యార్థులు ఆసక్తిగా ఆలకించారు. వారితో సీఐ విజయకుమార్ కాసేపు ముచ్చటించారు. 57 మంది కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐలు వెంకటరావు, ప్రమీల, సిబ్బంది పాల్గొన్నారు.